ప్రజాశక్తి
శనివారం 29 మార్చి 2025
5
పార్వతీపురం మన్యం

మొక్కజొన్న కొనుగోలు చేపట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో మొక్కజొన్న, పెసర, మినుములు పండుతున్నాయని, వాటిని ప్రభుత్వం కొనుగోలు చేసేలా కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి రెడ్డి రమణమూర్తి కోరారు. ఈ మేరకు వారు జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను ప్రయివేటు వ్యాపారులు కారుచౌకగా కొనుగోలు చేస్తున్నారని, పెట్టిన పెట్టుబడికి డబ్బులు రాక రైతులు నష్టపోతున్నారని చెప్పారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్క్ ఫెడ్ అధికారులతో మాట్లాడి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

గుమ్మలక్ష్మీపురం మండలం కన్నయ్యగూడలో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గసభ్యులు సుబ్బరావమ్మ

సాలూరులో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, ప్రజలు

విద్యుత్ భారాలపై ప్రజలు పోరాడాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సుబ్బరావమ్మ
పలుచోట్ల విద్యుత్ బిల్లులు దహనం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాలకు నిరసనగా ప్రజలంతా పోరాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపిన ట్రూ అప్ ఛార్జీలను ఉపసంహరించాలని, సెకీ ఒప్పందాలను రద్దుచేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాలోని పలు చోట్ల విద్యుత్ కార్యాలయా వద్ద ధర్నాలు నిర్వహించారు. గుమ్మలక్ష్మీపురం మండలం కన్నయ్యగూడలో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. సుబ్బరామమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు భారాలు వేయబోమని చెప్పి ప్రజలను నమ్మించి నేడు అధికారం వచ్చాక బాదుడే బాదుడుగా అన్ని రకాల నిత్యావసర సరుకులు ధరలు పెంచివేసేలా నిర్ణయాలు చేసిందని విమర్శించారు. సెకీతో చేసిన ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు మండంగి రమణ మాట్లాడుతూ గిరిజన ప్రజల ఓట్లతో గెలిచి నేడు గిరిజనులకు నష్టం చేసే విధానాల్లో భాగంగానే విద్యుత్ భారాలు మోపాలని చూస్తున్నారని, కావున గిరిజనులంతా వీటికి వ్యతిరేకంగా పోరాటాల్లో పాల్గొవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు, స్థానిక నాయకులు తోయక సోమశేఖర్, మురళీ, తోయక శంకర్రావు, కామేశ్వరి, మంగయి తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : విద్యుత్‌ఛార్జీల పెంపును నిరసిస్తూ పాత బస్టాండ్ ఆవరణలో సిపిఎం నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బివి రమణ, గొర్లి వెంకటరమణ, పాకల సన్యాసిరావు మాట్లాడుతూ తక్షణమే స్మార్ట్ మీటర్ల వ్యవస్థను రద్దు చేయాలని, పెంచిన ట్రూ అప్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిచో ప్రజలను కూడగట్టి సిపిఎం ఆందోళన చేపడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బంకురు సూరిబాబు, భానుమూర్తి, రాము, సింహాచలం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : స్థానిక మెయిన్ రోడ్‌లో సిపిఎం నాయకులు విద్యుత్‌ఛార్జీల పెంపునకు నిరసిస్తూ ఆందోలన చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ వై నాయుడు మాట్లాడుతూ విద్యుత్ భారాలు తగ్గించుకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ప్రజలను కలుపుకొని పోరాటాల ముందు తీసుకు వెళ్తామని దానికి ప్రజలంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు తనూజ్, శంకర్, ఈశ్వరరావు, రాముడు, రామారావు, గంగమ్మ, మంగమ్మ, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలోని చిలకలపల్లిలో గల విద్యుత్ కార్యాలయ వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు గేదెల సత్యనారాయణ, మండల నాయకులు యమ్మల మన్మధరావు మాట్లాడూ పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, సెకీ ఒప్పందం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిని అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గంట్యాడ బలరాం నాయుడు, సురేంద్ర, సంఘం, కళ్యాణ్, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ :సిపిఎం ఆధ్వర్యంలో పాలకొండలో విద్యుత్ బిల్లులు దగ్ధం చేసి విద్యుత్ సంస్కరణలు నిలిపివేయాలని, ప్రజలపై విద్యుత్ భారాలు తగ్గించాలని స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు దావాల రమణారావు మాట్లాడుతూ ప్రభుత్వం తమ విధానాలను మార్చుకొని ప్రజలపై భారాలు మోపడాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాలకొండ మండల సిపిఎం నాయకులు లక్ష్మణరావు, దూసి దుర్గారావు, కాదా రాము, రమేషు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ, బలిజిపేట, పార్వతీపురంలో నిరసన తెలుపుతున్న సిపిఎం కార్యకర్తలు, నాయకులు, ప్రజలు

విద్యార్థుల వివరాలు పక్కాగా ఉండాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

విద్యా సంస్థలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి సంబంధించిన వివరాలు పక్కాగా లభ్యంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. విద్యా శాఖపై శుక్రవారం కలెక్టర్ సమీక్షించారు. బడి ఈడు పిల్లలు విధిగా పాఠశాలల్లో ఉండాలన్నారు. పిల్లలు బడి బయట ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, వారి కుటుంబ, ఆరోగ్య పరిస్థితులు తదితర అంశాలపై వివరాలు ఉండాలని స్పష్టం చేశారు. పాఠశాల విద్యార్థుల్లో మృతులు ఉంటే వాటి వివరాలు, విశ్లేషణతో సహా ఉండాలని చెప్పారు. పాఠశాలలలో లభ్యంగా ఉన్న మౌలిక వసతుల వివరాల నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఉపాధ్యాయ - తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలని, అర్థవంతమైన చర్చలు జరగాలని స్పష్టం చేశారు. పిఎం శ్రీ పాఠశాలల పనితీరు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సిఆర్‌పిల పనితీరు మెరుగుపడాలన్నారు. పనితీరు బాగులేని వారిని తొలగించుటకు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

వచ్చే విద్యా సంవత్సరంలో స్పష్టమైన ప్రమాణాలు ఉండాలి

ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు విధిగా ఉండాలని, అందుకు వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నుండే పటిష్టమైన వ్యవస్థ పనిచేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ప్రతీ విద్యార్థి భాషా నైపుణ్యాలు, గణితంలో నాలుగు అంశాలలో స్పష్టమైన పరిజ్ఞానం కలిగి ఉండాలని అందుకు ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని చెప్పారు. చదవడం, రాయడంలో విద్యార్థి అందెవేసిన చేయి కావాలని ఆదేశించారు. పాఠశాలల్లో వివిధ క్లబ్బులు ఏర్పాటు చేసి తద్వారా వివిధ నైతిక విలువలు, విద్యా ప్రమాణాలు, తదితర అంశాలు గూర్చి వివరించాలని ఆయన పేర్కొన్నారు. మై స్కూల్ మై ప్రైడ్ కార్యక్రమాన్ని వచ్చే విద్యాసంవత్సరం నుండి మరింత పటిష్టంగా అమలు చేస్తామని ఆయన తెలిపారు. ప్రతి విద్యార్థికి భవిత కార్డు జారీ చేయాలని, పౌష్టిక ఆహారాన్ని అందించేందుకు మన బడి మన తోట పెద్ద ఎత్తున చేపట్టాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో డిఇఒ డాక్టర్ ఎన్.తిరుపతి నాయుడు, ఎడి ఎం.రమాజ్యోతి, పరీక్షల సహాయ కమిషనర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దూసి ధర్మారావు ఫౌండేషన్ సాహితీ పురస్కారానికి గంటేడ ఎంపిక

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

శ్రీకాకుళం జిల్లా సమున్నత సాంస్కృతిక సంస్థ దూసి ధర్మారావు ఫౌండేషన్ ఉగాదినాడు అందజేసే సాహితీ పురస్కారానికి మన్యంజిల్లాకు చెందిన ప్రముఖ కథారచయిత, కవి, విమర్శకులు గంటేడ గౌరునాయుడును ఎంపికచేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కిషోర్, దూసి వెంకటరమణమూర్తి తెలిపారు. కొమరాడ మండలం, దళాయిపేట గ్రామానికి చెందిన గంటేడ గౌరునాయుడు కథ, కవిత్వం, పాట, పద్యం, విమర్శ ఇలా అన్నింటిలో తనదైన శైలిలో సమర్థవంతంగా నిర్వహించగలిగిన వ్యక్తిగా ఉత్తరాంధ్రలోనే గాక రెండుతెలుగు రాష్ట్రాల్లో మంచి పేరు ఉంది. ఆయన రాసిన పాడుదమా స్వేచ్ఛా గీతం దేశవ్యాప్తంగా ఎంతో పేరుగాంచింది. కురుపాం కేంద్రంలో స్నేహ కళాసాహితీ సంస్థను స్థాపించి ఎంతోమంది కథకులను, కవులను తీర్చిదిద్దిన ఘనతకూడా ఆయనకే దక్కుతుంది. గిరిజన సంక్షేమశాఖలో తెలుగు ఉపాధ్యాయునిగా 30ఏళ్ళు సేవలు అందించి ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా, కళాకారులుగా తీర్చిదిద్దారు. చాసో స్ఫూర్తి సాహిత్య పురస్కారం, జేష్ఠ లిటరసీ అవార్డు, ఎస్ బి ఎస్ ఆర్ కళాపీఠం సాహిత్య పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం ధర్మనిధి పురస్కారం, విశాల సాహితీ పురస్కారం, అధికార భాషా సంఘం తెలుగు వికాసం పురస్కారం, గురజాడ సాహితీ పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ కథా పురస్కారం,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం, తాపీ ధర్మారావు జీవిత సాఫల్య పురస్కారం, తెలుగు భాషా దినోత్సవం గిడుగు పురస్కారం ఇలా ఎన్నో పురస్కారాలు ,అవార్డులు, ప్రశంసలు,అభినందనలు అందుకున్నారు. గౌరునాయుడుకు సాహితీ పురస్కారం ప్రకటన పట్ల పలు సాహితీ సంస్థలు, సాహిత్య ప్రముఖులు, మిత్రులు, అభినందనలు తెలిపారు.

కద్రక కళావతి
కురుపాం ఎఎంసి చైర్మన్

బిడ్డిక సుధారాణి
పాలకొండ ఎఎంసి చైర్మన్

ఎం.సూర్యనారాయణ
సాలూరు ఎఎంసి చైర్మన్

ఎఎంసి చైర్మన్ల నియామకం

ప్రజాశక్తి - పాలకొండ

పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ, సాలూరు, కురుపాం వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు భాగంగా పాలకొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలుగా బిడ్డిక సంధ్యారాణిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు శుక్రవారం విడుదల చేసింది. సీతంపేట మండలం మర్రిపాడుకు చెందిన ఈమె గత స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి తరపున జడ్పిటిసిగా పోటీ చేశారు. ఈమె తండ్రి బిడ్డిక వెంకటరమణ మండల టిడిపి కన్వీనర్‌గా పనిచేసి కొంతకాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందారు.

కురుపాం ఎఎంసి చైర్మన్‌గా కళావతి

గుమ్మలక్ష్మీపురం : కురుపాం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కద్రక కళావతి ఎన్నికయ్యారు. గుమ్మలక్ష్మీపురం మండలం లక్కగూడ గ్రామానికి చెందిన కళావతి 2001లో తొలిసారి లక్కగూడ సర్పంచిగా ఎంపికయ్యారు. 2006లో కొండవాడ ఎంపిటిసిగా స్వతంత్రంగా పోటీ చేసి గెలుపొందారు. 2013లో రెండో లక్కగూడ పంచాయతీ సర్పంచ్‌గా విజయం సాధించారు. 2015లో ఒడిఎఫ్ పంచాయతీగా లక్కగూడ పంచాయతీ ఉత్తమ సర్పంచిగా ఎంపికయ్యారు. 2016లో గుజరాత్‌లో ఉత్తమ మహిళా సర్పంచిగా ప్రధానమంత్రి చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ప్రస్తుతం ఈమె టిడిపి అరకు పార్లమెంట్ మహిళా కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్నారు. ఎఎంసి పదవి రావడం పట్ల సిఎం చంద్రబాబుకు, ఎమ్మెల్యే జగదీశ్వరికి అభినందనలు తెలిపారు. కళావతి ఎఎంసి చైర్మన్ ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు, టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎఎంసి పదవి రావడం పట్ల సిఎం చంద్రబాబుకు, మంత్రి సంధ్యారాణికి అభినందనలు తెలిపారు.

సాలూరు ఎఎంసి చైర్మన్‌గా సూర్యనారాయణ

సాలూరు : స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పాచిపెంట మండల టిడిపి సీనియర్ నాయకులు ముఖీ సూర్యనారాయణను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి మొదటి నుంచి విధేయుడుగా సూర్యనారాయణకు ఎఎంసి చైర్మన్ పదవి దక్కడంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మంత్రి సంధ్యారాణి నివాసంలో ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణను మండలాల నాయకులు, మాజీ ఎమ్మెల్యే భంజ్ దేవ్ అభినందించారు. పాచిపెంట మండలం మాతుమరు గ్రామానికి చెందిన ఆయన సర్పంచ్‌గానూ పనిచేశారు. 2014 నుంచి 2019 టిడిపి ప్రభుత్వం హయాంలో ఎఎంసి వైస్ చైర్మన్‌గా సూర్యనారాయణ పని చేశారు. ప్రస్తుతం టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. పార్టీలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్త నుంచి ఎఎంసి చైర్మన్ స్థాయికి సూర్యనారాయణ చేరుకున్నారు.

గిరిజనులపై పాలకుల నిర్లక్ష్యం

- జీడికి మద్దతుధర ప్రకటనలో నిర్లక్ష్యం
- అరకొరగా మౌలిక సదుపాయాలు
- నేడు ఐటిడిఎ వద్ద ధర్నా

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజను సంక్షేమానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గొప్పగా చెప్పడమే తప్ప ఆచరణలో ఎక్కడా అమలు కాలేదు. ఇందుకు నిదర్శనం ఏజెన్సీలో ప్రజలు పడుతున్న అవస్థలే. గిరిజనులు ఆరుగాలం శ్రమించి సేకరించిన అటవీ ఉత్పత్తులైన జీడి, చింతపండుకు మార్కెట్ ధర లేకపోవడం. ఏజెన్సీలో గిరిజన విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొనేందుకు అవకాశం లేక పట్టణాలకు వెళ్లే ఆర్థిక స్థోమత లేకపోవడంతో మధ్యలోనే చదువుకు స్వస్తి పలకాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక వైద్యం విషయానికొస్తే ఏజెన్సీలోని రోగులు స్థానిక ఆసుపత్రిలోని అరకొర సౌకర్యాలతోనే నెట్టుకొస్తున్నారు. కార్పొరేట్ హాస్పిటల్‌కు వెళ్లలేక, సరైన వైద్యమందక మధ్యలో కాలంచెల్లడం వంటివి పరిస్థితిలు అనేక ఉన్నాయి. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన శనివారం స్థానిక ఐటిడిఎ వద్ద ధర్నా చేపట్టింది.

జీడి పిక్క... బతుకు పక్క అని గిరిజనులతో అధికారులు జీడి తోటలు వేయించారు. కొంత వరకు బాగా ఉపాధి కల్పించగా, గత కొంతకాలంలో గిరిజనులకు నుంచి జీడిపిక్కలు కొనకుండా వ్యాపారులు, దళారులకు వదిలేస్తున్నారు. గిరిజనుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో జిసిసి ద్వారా 80 కిలోల జీడిపిక్కల బస్తా రూ.16వేలకు కొనుగోలు చేయాలని, సీతంపేట, కురుపాం, పార్వతీపురం, సాలూరులో జీడి పరిశ్రమలు ఏర్పరిచి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు 95శాతం మంది ఉన్నారు. వీరంతా పేదలే. డబ్బు పెట్టి ప్రైవేట్ చదువు చదవలేరు. పీజీ కోర్సులు చదివేందుకు జిల్లాలో ఎక్కడా ప్రభుత్వ పీజీ కాలేజీల్లేవు. దీంతో పక్క జిల్లాలోకు వెళ్లి ప్రైవేట్ కాలేజీలు చదివితే ఫీజు రీయంబర్స్మెంట్ రాదు. హాస్టల్ సౌకర్యం ఉండదు. ఇప్పటికైనా ప్రభుత్వం జిల్లాలో పీజీ కాలేజీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇక వైద్యానికి వస్తే జిల్లాలో సరైన వైద్య సదుపాయాలు లేవు. ప్రభుత్వం వైద్య కళాశాల పెట్టకుండా ప్రైవేటుకు అప్పచెబుతామని చెప్పుకొస్తుంది. కావున ప్రభుత్వమే మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేయాలి. కురుపాం, పాలకొండ, సాలూరులో 100 పడకల హాస్పిటళ్ల పనులు తక్షణమే పూర్తి చేయాలని ఎపి గిరిజన సంఘం కోరుతోంది.

ఎన్నేళ్లయినా గిరిజన గ్రామాలకు రోడ్లు వేయకపోవడంతో ఇప్పటికీ కొన్ని గిరిజన తండాల్లో డోలిమోత తప్పడం లేదు. కావున తక్షణమే అన్ని గ్రామాలకు రోడ్లు వేయాలి. ఈ బడ్జెట్లో జిల్లాలో ప్రాజెక్టులకు గిరిజన ప్రాంతంలో గల జంపరకోట, ఆడారు గెడ్డతో సహా అనేక గెడ్డలు, వాగులపై చెక్ డాంలు, మినీ రిజర్వాయర్ల నిర్మాణానికి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. గిరిజలకు తీవ్రమైన ద్రోహం చేస్తుంది. మినీ రిజర్వాయర్లు, చెక్ డ్యాముల నిర్మాణాలకు నిధులు కేటాయించి పనులు చేపట్టాలని, మరిన్ని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ వద్ద ఆదివాసీ గిరిజనసంఘాల ఆధ్వర్యాన ధర్నా తలపెట్టింది.

మక్కువ : ధర్నాను విజయవంతం చేయాలని ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు ఇందిర

ధర్నాను విజయవంతం చేయాలని ప్రచారం

ప్రజాశక్తి - పాలకొండ

గిరిజన సమస్యలపై శనివారం సీతంపేట ఐటిడిఎ వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని గిరిజన, రైతు సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని సిరికొండగూడలో శుక్రవారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.గంగయ్య మాట్లాడుతూ 80 కిలోల జీడిపిక్కల బస్తాకు రూ.16వేలకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, సీతంపేట, కురుపాం, సాలూరులో జీడి పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీతంపేట, కురుపాం, సాలూరులో వంద పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మించాలని, జిల్లాలో ఉన్నత విద్యా సంస్థలను నిర్మించాలని, మినీ రిజర్వాయర్లు, చెరువులు, చెక్ డామ్ నిర్మించాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో గిరిజన రైతులు, మహిళలు పాల్గొన్నారు.

మక్కువ : జీడికి మద్దతు ధర ఇవ్వాలని కోరుతూ పార్వతీపురం ఐటిడిఎ వద్ద శనివారం తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని మండలంలోని నగుళ్లు, దుగ్గేరులో గిరిజన సంఘం, ప్రజా సంఘాలు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర, నాయకులు పి.వెంకటరావు, నాగేశ్వరరావు, ముచ్వల నరసమ్మ, ఎర్రమ్మ, జె.సుజాత తదితరులు పాల్గొన్నారు. జీడికి మద్దతు ధర కల్పించాలని, ప్రకృతి వైపరీత్యంతో పాడైపోయిన జీడిపంటకు నష్టపరిహారం ఇవ్వాలని, సాలూరు, కురుపాం, సీతంపేట కేంద్రాల్లో జీడి పరిశ్రమ ఏర్పాటు చేయాలని ప్రచారం చేస్తూ చేపట్టనున్న ధర్నాలో ప్రజలంతా పాల్గొవాలని వారు కోరారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, గ్రామస్తులు

ఏనుగుల జోన్ పనులు నిలిపివేయాలి

బాధితుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

సీతానగరం మండలం గుచ్చిమి రిజర్వు ఫారెస్‌లో ఏనుగుల జోన్ పనులు నిలిపివేయాలని, బాధిత ప్రజల సమస్యల్ని పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యాన బాధిత గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీ వాత్సవ్‌కు వినతిపత్రాలు అందజేశారు. కలెక్టరేట్ వద్ద ధర్నా ఉద్దేశించి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుబ్బారావమ్మ, సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ జిల్లాలో ఏనుగుల సమస్యను పరిష్కరించమని ప్రజలు కోరుతున్నారని, అయితే ఆ ఏనుగులను తెచ్చి సీతానగరం మండలం అమ్మాదేవి కొండ ప్రాంతంలో ఉంచడం వల్ల ఈప్రాంత ప్రజలకు సమస్యగా మారుతుందని చెప్పారు. ఏనుగులను ఎక్కడ నుంచి వచ్చాయో అక్కడికి తరలించడం లేదా ఏనుగుల సంరక్షణ కేంద్రానికి పంపించడమో ఈ సమస్యకు పరిష్కారమని చెప్పారు. ట్రెంచ్ తవ్వడం వల్ల పేదల భూములు నష్టపోవడమేగాక నష్టపరిహారం కూడా చెల్లించిన పరిస్థితి లేదని చెప్పారు. అటవీ అధికారులు ట్రెంచ్ లోపలికి వెళ్లి భూములు సాగు చేసుకోవచ్చని చెబుతున్నారని, ఏనుగులు ఉన్న చోట వ్యవసాయం చేయడం సాధ్యం కాని పని అని అన్నారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరినట్లు చెప్పారు. దీనిపై జిల్లా కలెక్టర్ , ఐటిడిఎ పిఒ స్పందిస్తూ సీతానగరంలో పెట్టేది ఏనుగుల జోన్ కాదని, 3,4నెలల తాత్కాలిక ఏనుగుల హెూల్డింగ్ సెంటర్ మాత్రమేనని చెప్పారు. ఈ ప్రాంతంలో ఉన్న ప్రజలకు ఏ రకమైన ఇబ్బందులు, నష్టం ఉండదని స్పష్టం చేశారు. అయితే దీనికి అవసరమైన భూమి తప్ప మిగిలిన భూములు సాగు చేసుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, వి.ఇందిర, కె.రామస్వామి, జిల్లా కమిటీ నాయకులు రెడ్డి వేణు, సీతానగరం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకటరమణ, రెడ్డి రమణమూర్తి, సత్యనారాయణ, తౌడన్న దొర, చిన్న రాయుడుపేట, గుచ్చిమి, సీతారాంపురం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



కొత్తగా ఎన్నికైన బార్ అసోసియేషన్ సభ్యులు

పార్వతీపురం : జిల్లా బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం జరిగింది. అసోషియేషన్ అధ్యక్షుడిగా నల్ల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా నీలం రాజేశ్వర రావు, ఉపాధ్యక్షులుగా సుర్ల కృష్ణ, జాయింట్ సెక్రటరీగా మందా వెంకట కృష్ణారావు, కోశాధికారిగా మంత్ర పూడి వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

క్రైస్తవ మత ప్రభోధకుడు ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతి పట్ల సమగ్రమైన దర్యాప్తు నిర్వహించాలని ప్రజాసంఘాల నాయకులు గొర్లి వెంకటరమణ, బివి రమణ, పాకల సన్యాసిరావు తదితరులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పాత బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ దేశంలో ఇటీవల మైనారిటీలపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగం కల్పించిన మత, భావ ప్రకటన స్వేచ్ఛకు విరుద్ధంగా ఈ దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. అధికారంలో ఉన్న ప్రభుత్వ పెద్దలు కూడా ఈ దాడులు నివారించేందుకు ప్రయత్నించకపోగా, పరోక్షంగా మత విద్వేషాలు రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత సామరస్యాన్ని కాపాడేందుకు మైనారిటీల పట్ల జరుగుతున్న దాడులు నివారించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో బంకురు సూరిబాబు, నాగవంశం శంకర్రావు, చీపురుపల్లి సింహాచలం, బంగారు రవి, నాగవంశం పాపులమ్మ, పడాల ఇప్పలమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

జన్ జాతీయ గౌరవ దివాస్ స్టేట్ లెవెల్ ట్రైబల్ పెయింటింగ్ అండ్ ఆర్ట్ పోటీల్లో ప్రతిభ చూపి బహుమతులు పొందిన మండంగి బాలచంద్రుడు, హరిక రాజేష్‌లను కలెక్టర్ శ్యాం ప్రసాద్, పిఒ అశుతో శ్రీవాస్తవ అభినందించారు. గిరిజన ట్రైబల్ స్టేట్ లెవెల్ పెయింటింగ్ ఆర్ట్స్ పోటీల్లో, కోఆర్డినేటర్ అండ్ లైజన్ ఆఫీసర్‌గా ఉంటూ మెలుకువలు నేర్పి మూడు దఫాలు ప్రథమ బహుమతులు తెప్పించిన డ్రాయింగ్ టీచర్ రుగడ శ్రీనివాసరావు అభినందించారు.

ఇవిఎం గోదాముల వద్ద పటిష్ట భద్రత : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఇవిఎం గోదాముల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. త్రైమాసిక తనిఖీలో భాగంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద గల ఇవిఎం గోదామును వివిధ శాఖల అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పక్షాల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇవిఎం గోదాము భద్రతకు చేపడుతున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన ఇవిఎంలు, వివిప్యాట్ల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లాగ్ బుక్‌ను పరిశీలించి, లాగ్‌బుక్ లో అందరికీ అర్థమయ్యేలా వివరాలు నమోదు చేయాలని, పోలీస్ అధికారులను, భద్రతా సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. తనిఖీ కార్యక్రమంలో డిఆర్ఒ కె.హేమలత, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కె.ఉమ, వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు..

ఎమ్మెల్యేకు వినతిని అందజేస్తున్న ద్రాక్షిణిని గ్రామస్తులు

తాగునీటి సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం, కొండచిలకం పంచాయతీ ద్రాక్షిణికి రోడ్డు, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామస్తులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. గ్రామానికి రోడ్డు లేక వర్షాకాలంలో చాలా ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందిగా ఉందని అన్నారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందించి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే

గుమ్మలక్ష్మీపురం : జియ్యమ్మవలసకు చెందిన వరదా సరోజినికి సిఎం సహాయనిధి నుండి రూ.50,786ను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆర్థిక సహాయం అందించారు. సరోజిని బిడ్డ సంచి కాయ ఇరేనా ఆపరేషన్ అనారోగ్యానికి గురైన విషయం ఎమ్మెల్యే దృష్టికి రావడంతో ఆర్థిక సహాయం అందేలా కృషి చేశారు.

బంగారు బాటకు అడుగులు వేయండి

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరేందుకు ఆలోచించి మీ బంగారు బాటకు అడుగులు వేయాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డిజిఎస్‌వి త్రినాధ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం వీరఘట్టంతో పాటు నడుకూరు, విక్రంపురం, కంబర వలస, కత్తుల కవిటి, రేగులపాడు, హుస్సేన్ పురం తదితర గ్రామాల్లో పర్యటించి పదో తరగతి పరీక్ష రాస్తున్న ప్రతి విద్యార్థి ఇంటికి వెళ్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని విద్యార్థులకు, తల్లిదండ్రులకు విన్నవించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి.ముద్దుబాబు, పి.శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో 9 మందికి తీవ్ర గాయాలు

భయాందోళనలో పట్టణ ప్రజలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం వీరఘట్టంలో పిచ్చికుక్క జి.నాగరాజు, కె.శ్రీరాములు, ఎం.ధరణి, సుజాత, జి.పార్వతి, పి.రామిశెట్టి, కె.గంగులు, బి.ధర్మారావు, కె.రవిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. దీంతో పట్టణ ప్రజలు భయమందోళనకు గురయ్యారు. గాయపడిన వారంతా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స చేసుకున్నారు. శునకాలు గుంపు గుంపులుగా పట్టణంలో స్వైరవిహారం చేయడంతో ప్రజలు మరింత భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల నుంచి ప్రజలకు విముక్తి కలిగేలా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ముస్లిములకు రంజాన్ తోఫాను అందజేస్తున్న పుష్పశ్రీవాణి, పరీక్షిత్ రాజు

రంజాన్ తోఫా అందించిన పుష్ప శ్రీవాణి, పరీక్షిత్ రాజ్

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రమైన కురుపాంలో గల శివన్నపేట జామా మసీదులో ముస్లిం సోదరులకు మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్ప శ్రీవాణి, మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజ్ శుక్రవారం సాయంత్రం ఇఫ్తార్ విందును ఇచ్చి 55 ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను అందజేసి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జడ్పిటిసి జి.సుజాత, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, మండల కోప్షన్ సభ్యులు షేక్ జిలానీ, మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, మండలంలో గల వైసిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

నవోదయ మోడల్ గ్రాండ్ టెస్టులో సత్తాచాటిన విద్యార్థులు

ప్రజాశక్తి - వీరఘట్టం

యుటిఎఫ్ నిర్వహించిన నవోదయ మోడల్ గ్రౌండ్ టెస్ట్‌లో పాల్గొన్న పలువురు విద్యార్థులు ఇటీవల విడుదలైన నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో పలువురు ఎంపికైనట్లు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుర్గాప్రసాద్, కె.గోవిందరావు, కన్వీనర్ బి.వాసుదేవరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మక్కువ మండలం పాయకపాడుకు చెందిన టి.గోవర్ధన్, సిహెచ్ యువాన్, కోటబొమ్మాళి మండలం వై.కీర్తిక, ఎస్.శరణ్య, పొందూరు మండలం జి.కేశవ, వీరఘట్ట మండలం కొట్టు గుమ్మడకు చెందిన డి.స్నేహలత ఎంపికయ్యారు. వీరికి యుటిఎఫ్ మండల శాఖ అభినందనలు తెలిపింది.

ఆరో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు కల్పించాలి

ప్రజాశక్తి - కురుపాం

ఆరు, ఇంటర్ ప్రవేశాలు శతశాతం జరిపించాలని ఎపి ఆదర్శ పాఠశాల స్టేట్ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ధర్మకుమార్ అన్నారు. శుక్రవారం ఆయన ఆదర్శ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణ గూర్చి అడిగి తెలుసుకొని శత శాతం ప్రవేశాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రిన్సిపల్ వి.రామలక్ష్మి వెనకబడిన విద్యార్థుల విద్యాభివృద్ధి మెరుగుకు తీసుకుంటున్న చర్యలు గూర్చి వివరించారు.

16 మందిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో గతంలో నాటుసారాతో పట్టుబడి కేసులు నమోదైన 16 మంది నాటుసారా ముద్దాయిలను తహశీల్దార్ అప్పలరాజు ఎదుట హాజరు పరచి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు రాజాం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఆర్. జైభీమ్ తెలిపారు. వీరికి ఏడాదికి ఒక లక్ష రూపాయల చొప్పున పూచి కత్తుతో బైండోవర్ చేయడమైందన్నారు. మళ్లీ నేరం చేసినట్టయితే జరిమానాతో పాటు జైలు శిక్షకూడా తప్పదని తహశీల్దార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు లబ్ధిదారుల ధ్రువపత్రాలు పరిశీలన

కొమరాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ధ్రువపత్రాలు పరిశీలన శనివారం జరుగుతుందని ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు అన్నారు. మండలంలో 41 యూనిట్లకు సంబంధించి లక్ష్యాలు మేరకు 214 దరఖాస్తులు ఆన్లైన్లో వచ్చినట్లు తెలిపారు. కూనేరు ఎస్ఐబి, కొమరాడ ఎపిజివిబి ద్వారా ఈ రుణాలను మంజూరు చేసేందుకు ప్రభుత్వ నిర్ణయించినట్లు తెలిపారు.

పథకాలను వినియోగించుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ పథకాలను గిరిజన లబ్ధిదారులు వినియోగించుకోవాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక ఐటిడిఎలో సిసిడిపి, ఎన్ఎస్‌పి, టిఎస్ఎస్ నిధుల ద్వారా గిరిజన రైతులకు వివిధ రకాల యంత్ర పరికరాలను ఎమ్మెల్యే, పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. తొలుత పిఒ మాట్లాడుతూ ఐటిడిఎ ద్వారా ఇచ్చిన యంత్ర పరికరాలను లబ్ధిదారులు సక్రమంగా వినియోగించుకోవాలని అదే విధంగా గ్రామంలోని ఇతర రైతులకు కూడా ఇవ్వాలని అన్నారు. వీటి ద్వారా గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ యంత్ర పరికరాలు బయట వ్యక్తులకు అమ్మరాదని సూచించారు. వీటిపై ఐటిడిఎ నుంచి పర్యవేక్షణ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటుందన్నారు. గతంలో ఎప్పుడూ ఇటువంటి యంత్ర పరికరాలను పంపిణీ జరగలేదని, ఈ ప్రభుత్వం ఏర్పడ్డాక మళ్లీ యంత్ర పరికరాల పంపిణీ ప్రారంభించామని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన రాయితీ పథకాలను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజనులకు పంపిణీ చేసిన యంత్ర పరికరాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వైటిసిలో గిరిజన నిరుద్యోగ యువతకు శిక్షణ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తల్లికి వందనం కార్యక్రమం కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. అనంతరం భామిని మండలం ఘనసరానికి చెందిన శ్రీ గౌరీ డ్వాక్రా సంఘానికి రూ.10 లక్షల విలువ గల ఇటుకల తయారీ యూనిట్ మంజూరు పత్రాలను ఎమ్మెల్యే, పిఒ అందించారు. ఈ యూనిట్లో లబ్ధిదారుల వాటా రూ.2 లక్షలు కాగా, మిగిలిన రూ.8 లక్షలు సబ్సిడీ కింద అందించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎఒ సునీల్, ఐటిడిఎ ఉద్యాన శాఖ అధికారి వెంకట గణేష్, వెలుగు ఎపిడి సన్యాసిరావు, డిపిఎం రమణ, హెచ్ఒ జయశ్రీ, ఇతర అధికారులు ఎంపిపి [illegible], జడ్పిటిసి లక్ష్మి, సర్పంచ్ కళావతి స్థానిక ప్రజాప్రతినిధులు సవర తోట మొఖలింగం, సంధ్యారాణి, సోను, మాజీ ఎంపిపి మాలయ్య పవన్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఉపకరణాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ, పిఒ

మృతదేహం వద్ద రోదిస్తున్న చలపతి తల్లి (ఇన్‌సెట్‌లో చలపతి)

ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి

డిప్యూటీ వార్డెన్‌కు షోకాజ్ నోటీసు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దోనుబాయి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థి సవర చలపతి (14) ఆసుపత్రిలో ప్రథమ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. దోనుబాయి గిరిజన బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో సవర చలపతి 9వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం టిఫిన్ అనంతరం గదిలో తోటి విద్యార్థులతో పాటు డబల్ కాట్ మంచానికి తువ్వాలు చుట్టి ఉయ్యాలు ఊగుతూ కాలు జారడంతో మంచం విద్యార్థి చెవిపై బలంగా పడింది. దీంతో చెవి, తల వెనుక భాగంలో గట్టిగా మోయడంతో రక్త స్రావం జరిగింది. వెంటనే ఉపాధ్యాయులు ధోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యాధికారి భానుప్రతాప్ ప్రథమ చికిత్స అందించినప్పటికీ మృతి చెందాడు. దీంతో పిఒ యశ్వంత్‌కుమార్ రెడ్డి, డీఎస్పీ రాంబాబు, ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, కృష్ణవేణి సంఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకొని ఎలా జరిగిందని ఆరా తీశారు. దీనిపై పూర్తి స్థాయిలో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు డిప్యూటీ వార్డెన్ సుబ్బారావుకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. మృతిని కుటుంబానికి దహన సంస్కారాల కింద రూ.10వేలు అందజేశారు. మృతి చెందిన విద్యార్థి కొత్తగూడ పంచాయతీ కె.కామగూడకు చెందిన వాడు. తండ్రి భీముడు రెండేళ్ల క్రితం మృతి చెందాడు. తల్లి లండమ్మ, పెద్దన్నయ్య గణేష్, చిన్నన్నయ్య ప్రసాదు తల్లితో విజయవాడ ఉపాధికి వెళ్లాడు. ఐదు రోజుల క్రితమే గ్రామం చేరుకొని గురువారం ఉదయం పాఠశాలకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం చలపతి ప్రమాదవశాత్తూ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దీనిపై దోనుభాయి ఎస్సై షేక్ మస్తాన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. సిఐ చంద్రమౌళి, హెచ్ఎం ఎ.భాస్కరావు, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థి మృతి బాధాకరం

పాలకొండ : దోనుభాయి ఆశ్రమపాఠశాల విద్యార్థి చలపతి మృతి బాధాకరమని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో మృతి చెందిన గిరిజన విద్యార్థి చలపతిరావు పోస్టుమార్టం దగ్గరికి వెళ్లి పరిశీలించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడి మృతదేహాన్ని తొందరగా కుటుంబసభ్యులకు అప్పగించాలని చెప్పారు.

నివేదికను వెల్లడిస్తున్న డిఆర్‌పి, సమావేశంలో పీడీ రామచంద్రరావు, ఎంపిపి ప్రమీల

సంతకాలు, వేలిముద్రల్లేకుండా వేతనాల చెల్లింపులు

ఉపాధి సిబ్బందిపై డ్వామా పీడీ ఆగ్రహం

ప్రజాశక్తి - పాచిపెంట

ఉపాధి హామీ పనుల మస్తర్లలో సంతకాలు, వేలిముద్రలు లేకుండా మండలంలోని 28 పంచాయతీల్లో సుమారు 200 మంది కూలీలకు వేతనాలు చెల్లించినట్టు ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీలో తేలింది. ఈ మేరకు మీరు ఎలా వేతనాలు చెల్లిస్తారంటూ ఫీల్డ్ అసిస్టెంట్లపై డ్వామా సీడీ కె.రామచంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో డ్వామా పీడీ రామచంద్రరావు ఆధ్వర్యంలో 2023 -24 ఏడాదికి సంబంధించి ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. మండలంలో 2023 - 24 ఏడాదికి సంబంధించి 28 పంచాయతీల్లో ఉపాధి హామీ పనులకు సంబంధించి రూ.13 కోట్ల 44 లక్షలు, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి రూ.2కోట్ల 69 లక్షలు, ఐటిడిఎ ద్వారా రూ.4కోట్ల 67 లక్షలు పనులు, మెటీరియల్‌కు సంబంధించి రూ.7 కోట్ల 87 లక్షలు మొత్తం రూ.20 కోట్ల 82 లక్షలతో 2023-24 ఆర్థిక సంవత్సరంలో పనులు చేపట్టినట్లు సామాజిక తనిఖీల్లో వెల్లడించారు. ముఖ్యంగా 20 పంచాయితీల్లో జీడి మామిడి మొక్కలు నాటితే నాటిన మొక్కలకు నీరు పోయకపోవడంతో 80శాతం మొక్కలు చనిపోయినట్లు డిఆర్‌పిలు వెల్లడించారు. దీనిపై టెక్నికల్ అసిస్టెంట్లు, ఇసీలకు వారి జీతాల్లో సుమారు రూ.రెండు లక్షలు రికవరీ చేస్తున్నట్లు పీడీ తెలిపారు. అలాగే కొన్ని పంచాయితీల్లో వాలంటీర్లకు అదనంగా పని దినాలు ఇచ్చారని తేలడంతో పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మట్టి రోడ్డు కొలతల్లో తేడాలు బయటపడ్డాయి. ముఖ్యంగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి సుమారు రూ.17 లక్షలు గుత్తేదారుడు ఖాతాలో జమ చేయకుండా ఆ శాఖ ఇఇ ఖాతాలో జమ చేసినట్లు తేలడంతో అలా ఎలా జమ చేస్తారని ఆ శాఖ జెఇ, ఉపాధిహామీ కంప్యూటర్ ఆపరేటర్‌ను పీడీ ప్రశ్నించారు. మండలంలో మూటకూడు పంచాయతీకి సంబంధించి కొంతమంది గిరిజన యువకులు తమ పంచాయతీలో 2006 నుండి మైదాన ప్రాంతానికి చెందిన వ్యక్తి ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడని మా గిరిజన యువకుడికే ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం కల్పించాలని పీడీకి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఎంపిపి బి.ప్రమీల, ఎంపిడిఒ బివిజె పాత్రో, ఎపిఒ సత్యనారాయణ, డిఆర్పీలు, పలువురు సర్పంచులు నాయకులు పాల్గొన్నారు

మంత్రి లోకేష్‌ను కలిసిన వీరేశ్ చంద్ర దేవ్

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లి గల తన నివాసంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్‌చంద్రదేవ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుపాం నియోజవర్గంలో గల దీర్ఘకాలిక సమస్యలు, గిరిజన గ్రామాల విద్య, వైద్యం, రహదారి, సౌకర్యాలు కల్పించి పాఠశాలలు అభివృద్ధికి సహకరించాలని కోరగా, అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

పరీక్షా కేంద్రాన్ని ఎంఇఒ సందర్శన

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని ఎంఇఒ-1 డి.గౌర్నాయుడు శుక్రవారం సందర్శించారు. ప్రతి పరీక్ష గదికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించారు. ధైర్యంగా పరీక్ష రాయాలని విద్యార్థులకు సూచించారు.

ఉపాధిహామీ పనులపై నేడు ప్రజా వేదిక

పార్వతీపురంరూరల్ : స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో మండలానికి సంబంధించి 2023 -24 సంవత్సరానికి గానూ శనివారం ఉదయం 10 గంటలకు ప్రజా వేదిక క సామాజిక తనిఖీ కార్యక్రమం జరుగుతుందని ఎంపిడిఒ జి.రమణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలేవీ?

మున్సిపల్ సమావేశంలో సభ్యులు నిలదీత

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న భవన నిర్మాణాలపై తీసుకున్న చర్యలేమిటని పలువురు కౌన్సిలర్లు టిపిఒ ఝాన్సీని నిలదీశారు. శుక్రవారం చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు వివిధ సమస్యలపై మాట్లాడారు. 24వ వార్డు కౌన్సిలర్ బి.హైమ సత్యవతి మాట్లాడుతూ పట్టణ ప్రధాన రహదారిలో వైభవ్ జ్యువెలరీ షాపు నిర్వహిస్తున్న భవనానికి ఎలా అనుమతి మంజూరు చేశారని ప్రశ్నించారు. ఒక ఫ్లోర్‌కు అనుమతి తీసుకుని మూడు ఫ్లోర్లు ఎలా నిర్మించారని కౌన్సిలర్ గిరి రఘు నిలదీశారు. అందరికీ ఇదే నిబంధన వర్తిస్తుందా అని ప్రశ్నించారు. టిపిఒ మాట్లాడుతూ ముందు ఒక ఫ్లోర్ నిర్మాణానికే అనుమతి కోసం దరఖాస్తు చేశారని, తర్వాత మూడు ఫ్లోర్లు నిర్మించారని చెప్పారు. వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు మాట్లాడుతూ మున్సిపాలిటీ లో పారిశుద్ధ్య విభాగంలోని వాహనాలు వాడకుండా వదిలేశారని చెప్పారు. తాత్కాలిక పద్ధతిలోనైనా డ్రైవర్లను నియమించాలని కోరారు. రానున్న శ్యామలాంబ పండుగ నేపథ్యంలో వాహనాలకు డ్రైవర్లను నియమించాలని కౌన్సిలర్లు గిరి రఘు, రాపాక మాధవరావు, బి.శ్రీనివాసరావు కోరారు. టిడిపి కౌన్సిలర్లు హర్షవర్ధన్, లక్ష్మోజీ, వైదేహి మాట్లాడుతూ ఇంతవరకు లేని తొందర ఇప్పుడెందుకని ప్రశ్నించారు. మున్సిపాలిటీలో సామాజిక మరుగుదొడ్ల మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి సంధ్యారాణి ఆరు నెలల క్రితం చెప్పారని, ఇంతవరకు ఎందుకు మరమ్మతు చేయలేదని కౌన్సిలర్ గిరి రఘు ప్రశ్నించారు. మరుగుదొడ్ల మరమ్మతు పనులకు బుడా సంస్థ కోటీ ఐదు లక్షల రూపాయలు మంజూరు చేస్తుందని కమిషనర్ బివి ప్రసాద్ చెప్పారు. ఇవి కాక మరో రూ.2 కోట్లు మున్సిపాలిటీకి మంజూరవుతాయని, భవిష్యత్తులో ఇది ప్రభుత్వానికి తిరిగి చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలోని 40 మున్సిపాలిటీలకు రూ.2 కోట్లు చొప్పున నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ జర్జాపు దీప్తి, ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్ మోహన్ రావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి తీర్మానాలు ఇవ్వాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, ఎంపీటీసీలు తీర్మానాలు ఇవ్వాలని ఎమ్మెల్యే నిమ్మక జయకష్ణ అన్నారు. మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం స్థానిక వైటిసిలో ఎంపిపి ఆదినారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వెండర్ విధానం రద్దు చేయాలని ధోనుభాయి ఎంపిటిసి జి.కోటేశ్వరరావు సభ దృష్టికి తీసుకువచ్చారు. అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు ప్రోటోకాల్ స్థానిక ప్రజాప్రతినిధులకు ఇవ్వడంలేదన్నారు. దీనిపై ఎమ్మెల్యే జయకృష్ణ స్పందిస్తూ వెండర్ విధానం గురించి సిఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. సర్పంచులకు, ఎంపీటీసీలకుఅధికారులు ప్రోటోకాల్ పాటించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో ముటివేషన్లు సరిగ్గా జరగడం లేదన్నారు. వ్యవసాయ, రెవెన్యూ సంయుక్తంగా తప్పులు తడకలు సరిచేసుకొని ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే చెప్పారు. డిప్యూటీ తహశీల్దార్ శ్రీవిద్య మాట్లాడుతూ మోటివేషన్లు రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి 15 రోజులు పడుతుందని చెప్పారు. వ్యవసాయ శాఖ ద్వారా యాంత్రిక పనిముట్లు సబ్సిడీలో అందిస్తుందని దీనిని వినియోగించుకోవాలని కోరారు. గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపిపి కె.సరస్వతి, సర్పంచులు వెంకి నాయుడు, జీలకర్ర సుందరమ్మ, కళావతి, జడ్పిటిసి లక్ష్మి, ఎంపిడిఒ కె.గీతాంజలి, ఇఒపిఆర్‌డి కె.సత్యం, పలువురు అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

సేంద్రీయ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.ధ్రువ రైతులకు సేంద్రీయ ఎరువుల వాడడం వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రీయ ఎరువుల వాడకం వీటి ప్రాధాన్యత, భూమిలో కర్బన శాతం పెంచే విధి విధానాల గురించి రైతులకు వివరించారు. ఫెర్మెంటెడ్ ఆర్గానిక్ మెన్యూర్స్ మీద ప్రాజెక్టు వచ్చిందని, దీన్ని ఈ ఖరీఫ్ సీజన్లో అమలు చేస్తున్నామని తెలిపారు. దీని కొరకు రైతులకు ఫెర్మెంటెడ్ సేంద్రియ, రసాయనిక ఎరువులను ఉచితంగా ఇచ్చి వాటి ద్వారా వరి అపరాలు, మొక్కజొన్న పంటలను పండించాలని, రసాయన, సేంద్రియ ఎరువుల వాడకం వలన భూమిలో వచ్చే మార్పులను పంట దిగుబడులను, వచ్చే రెండేళ్ల ఖరీఫ్‌లో పరిశీలించి రైతులకు దీని ఫలితాలను వివరిస్తామన్నారు. ప్రకృతి రిసోర్స్ పర్సన్ డాక్టర్ ఎస్.స్రవంతి సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఫెర్టిలైజర్ ధనుంజయ్ సేంద్రియ ఎరువుల ఉపయోగం, తయారీని రైతులకు వివరించారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

మంత్రి ఇలాకాలో గిరిజనులకు రక్షణ లేదా?

ఎజెఎసి నాయకులతో మాజీ డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి నియోజకవర్గంలో గిరిజనులకే రక్షణ లేని పరిస్థితి ఏర్పడిందని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. ఈనెల 15న తోణాం పంచాయతీ మద్దెనవలసలో భూస్వాముల దాడికి గురైన కూనేటి లక్ష్మణరావు,లక్ష్మీలతో కలిసి ఎజెఎసి గౌరవాధ్యక్షులు నిమ్మక జయరాజు, కొండగొర్రి ఉదయ్ కుమార్ రాజన్నదొరను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. పెత్తందారుల దాడిలో గాయపడిన లక్ష్మణరావు, ఝాన్సీని ఆయనకు జెఎసి నాయకులు పరిచయం చేశారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ గతంలో గిరిజన ఎంపిటిసి సభ్యులు జన్ని సీతారాంపై దాడి జరిగిందని, ఇంతవరకు ఈ కేసులో ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. ఇప్పుడు మద్దెనవలసలో గిరిజనుల ఇంటికెళ్లి పెత్తందార్లు దాడి చేశారని చెప్పారు. కూర్మరాజుపేట పంచాయతీ చిన్నవలస, కరాసువలస పంచాయతీల్లోనూ దళితులు, గిరిజనులపై దాడులు జరిగాయని చెప్పారు. పాచిపెంట మండలంలో గిరిజన సర్పంచులను గిరిజనేతరులు బెదిరిస్తున్నారని చెప్పారు. ఇలాంటి పరిస్థితులు గతంలో ఎన్నడూ చూడలేదని చెప్పారు. గిరిజన మంత్రి సంధ్యారాణి సొంత నియోజకవర్గంలోనే గిరిజనులకు రక్షణ లేని పరిస్థితి కనిపిస్తోందని అన్నారు. ఎజెఎసి గౌరవాధ్యక్షులు నిమ్మక జయరాజు, కొండగొర్రి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల మద్దెనవలసలో గిరిజనులపై దాడి చేసిన విషయంపై మంత్రి సంధ్యారాణికి ఫిర్యాదు చేశామని చెప్పారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని మంత్రి కోరామని, దీనికి ఆమె సానుకూలంగా స్పందించారని వారు చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్టీ సెల్ కన్వీనర్ నెమలి పిట్ట కళ్యాణ్, ఇతర గిరిజన నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు స్టాపర్ల వితరణ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రోడ్డుభద్రత చర్యలలో భాగంగా,రోడ్డు ప్రమాదాల నివారణకు సామజిక బాధ్యతగా పట్టణానికి చెందిన వైభవ్ జ్యువలరీ యాజమాన్యం తమవంతు సహకారంగా 4 ట్రాపిక్ స్టాపర్లను శుక్రవారం పార్వతీపురం పట్టణ పోలీస్ వారికి అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ మురళీధర్ మాట్లాడుతూ రోడ్డుభద్రత చర్యల్లో భాగంగా, రోడ్డు ప్రమాదాల నివారణకు సామజిక బాధ్యతగా తమవంతు సహకారంగా 4 ట్రాపిక్ స్టాపర్లను అందజేసిన వైభవ్ జ్యువలరీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నియమ నిబంధనలను సక్రమంగా పాటించి పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం ట్రాఫిక్ ఎస్సై పాపారావు, వైభవ్ జ్యువలరీ బ్రాంచ్ మేనేజర్ గిరిబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తం

ప్రజాశక్తి - కొమరాడ

కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు సూచించారు. మండలంలోని కుమ్మరిగుంట పంచాయతీ పరిధిలో ఉన్న కందివలస గ్రామంలో వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. శిబిరంలో చేపట్టిన వైద్య పరీక్షలు, ఆరోగ్య తనిఖీలు, అందజేసిన చికిత్సా వివరాలు, ఒఆర్ఎస్ ప్యాకెట్ల లభ్యత పరిశీలించారు. అక్కడ ప్రజలతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ జగన్మోహన్ గ్రామంలో ఫ్రైడే డ్రైడే నిర్వహణ తీరు పరిశీలించారు. వేసవిలో ప్రబలే అనారోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సిహెచ్. అరుణ్ కుమార్, ఎఎంఒ సూర్యనారాయణ, పిహెచ్ఎన్ విజయకుమారి, వైద్య సిబ్బంది వాణి, శారద, రమేష్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ బోల్తా.. డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని చిత్రకోట బొడ్డవలస సమీపంలో టేకు మొక్కలకు నీరు పెడుతున్న వాటర్ ట్యాంకర్ బోల్తా పడడంతో డ్రైవర్ పెద్దిరెడ్డి పోలిరాజు (56) దుర్మరణం చెందారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం కాశయ్యపేటకు చెందిన పోలిరాజు వాటర్ ట్యాంక్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. కె.నీలమ్మ భూమిలో నాటిన టేకు మొక్కలకు నీరు పోస్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పింది. దీంతో ట్రాక్టర్ ఇంజిన్ కింద డ్రైవర్ పడి, తల నుజ్జునుజ్జు కావడంతో అక్కడికక్కడే మరణించారు. పోలిరాజు కుమారుడు సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేశారు. కుటుంబ పెద్దదిక్కు మరణించడంతో కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని కందులపదం పంచాయతీ చిన్నవలసకు చెందిన వాటిక ఐశ్వర్య (20) అనుమానాదాస్పద స్థితిలో చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే చిన్నవలసకు చెందిన వాటికి ధర్మరాజు కుమార్తె ఐశ్వర్య ఖరాసువలస పంచాయతీ దత్తివలస గ్రామానికి చెందిన పెరుమాలి రాంబాబు ప్రేమించుకుని ఇద్దరు కలిసి విశాఖలో గల ప్రముఖ బట్టల దుకాణంలో పనిచేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం ఐశ్వర్య తన స్వగ్రామానికి వచ్చి ఉండి గురువారం ఉదయం నాలుగు గంటలకు విశాఖ బయలుదేరుతున్నానని చెప్పి ఇంటి వద్ద నుంచి బయలుదేరి రాంబాబుతో వెళ్లినట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. అనంతరము మధ్యాహ్నం 12 గంటలకు ధర్మారాజుకు ఫోన్ చేసి తాను విశాఖ చేరిపోయానని తెలిపింది. విశాఖపట్నం వెళ్ళింది కదా అని తండ్రి ఉండగా శుక్రవారం ఉదయం అన్నమరాజు వలస పంచాయితీ చీపురువలస వద్ద గల జీడి తోటలో ఒక చెట్టుకు వేలాడుతూ మరణించింది. ఈ మరణం వెనుక అనుమానాలు ఉన్నాయని తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం ఫిర్యాదు చేశారు. సాలూరు రూరల్ ఎస్ఐ నరసింహామూర్తి సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకొని క్లూస్ టీమ్ను రప్పించి పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం సాలూరు ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు ఈ మరణం వెనుక అనుమానాలు ఉన్నాయని దీనికోసం ప్రేమికుడు రాంబాబును అనుమానిస్తున్న పోలీసులు విశాఖ కూడా వెళ్లినట్లు, కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరసింహామూర్తి తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలం, అడ్డాపు శిల పంచాయితీ ఏగూరు వలసకు చెందిన గుణుపూరు సత్యనారాయణ మద్యానికి బానిసయ్యాడు. ముగ్గురు పిల్లలు ఉన్నారు. నిత్యం తాగుతూ ఉంటే ఎలా అని ఆయన భార్య మందలించింది. దీనితో మనస్తాపం చెంది మేకలకు, గొర్రెలకు కొట్టిన మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే 108 ద్వారా పార్వతీపురం కర్షక మహర్షి ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. అలాగే జియ్యమ్మవలస మండలం బాసంగికి చెందిన గేదెల నర్సింహ నాయుడు మోటార్ మెకానిక్. అతనికి అదే గ్రామానికి చెందిన ఒక అమ్మాయితో నిశ్చితార్థం జరిగింది. ఆ అమ్మాయి నర్సింగ్ కోర్సు చదువుతోంది. కానీ ఇంతలో అమ్మాయి నేను అప్పుడే పెళ్లి చేసుకోను ఇంకా చదువుతానని అనడంతో మనస్తాపం చెంది తోటపల్లి బేరేజ్ వద్దకు వెళ్లి గడ్డిమందు తాగి ఆత్మహత్యా యాత్నానికి పాల్పడ్డాడు. బేరేజ్ వద్ద గడ్డిమందు తాగి తిరిగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకోవడంతో గమనించిన కుటుంబీకులు ఆటోలో పార్వతీపురం కర్షక మహర్షి ఆసుపత్రికి తీసుకొని రాగా వైద్యులు చికిత్స అందించారు. ఇద్దరి వివరాలు నమోదు చేసినట్లు జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు ఎఎస్ఐ నిమ్మకాయల భాస్కరరావు తెలిపారు.

వేలం ప్రకటన
మహారాజశ్రీ పార్వతీపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం.1/2020 ఓ.ఎస్. 36/2017

బిట్వీన్ :
సారికి చంద్రశేఖర్ ......డిక్రీ హోల్డర్
అండ్:
దాసరి గోవిందనాయుడు (డైడ్) మరియు 3 అదర్స్
.....జడ్జిమెంట్ డెటార్లు

పై నెంబరు అమలులో ఈ దిగువ షెడ్యూలు దాఖలా మరియు జడ్జిమెంటు డెటార్లు యొక్క హక్కు అనుభవములో యున్నటువంటి ఆస్తిని పై కోర్టులో **తే 25.04.2025 దీన ఉదయం 10.30 గం॥ ని॥** లగాయతూ బహిరంగముగా వేలం వేయబడును. కావున వేలంలో పాల్గొనదలచిన వారు ఇస్తియారు షరతులకు లోబడి వేలంలో పాల్గొనగలరు.

ఆస్థి వివరం:

విజయనగరం జిల్లా, ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా, పార్వతీపురం మండలం, పార్వతీపురం మున్సిపాలిటీ, పార్వతీపురం కొత్తబెలగాం, సుజాతానగర్‌లో యున్నటువంటిన్నీ సర్వే నెం. 544/1, బ్లాకు నెం. 35, ఇంటి నెం. 17-42, అసెస్మెంట్ నెం. 1091011229గా కలిగినటువంటిన్నీ తూర్పు-పడమరలకు 15 అడుగులు వెడల్పున్నూ, ఉత్తర - దక్షిణములకు 70 అడుగులు పొడవు కలిగినటువంటి ఆర్.సి.సి శ్లాబు ఇంటికి హద్దులు.
తూర్పునకు : కొండంగి శ్రీనివాసరావు గారి ఆర్.సి.సి శ్లాబ్ ఇల్లు, **దక్షిణమునకు:** దాసరి రామారావు గారి ఖాళీ స్థలం, **పడమరనకు** : యీ ఇంటికిన్నీ దాసరి రామారావు గారి ఇంటికిన్నీ మధ్యనవున్న రస్తా
ఉత్తరమునకు : కొత్తబెలగాం రోడ్డు (టి.బి.రోడ్డు)
ఈసి లెక్క దాఖలా అన్యాక్రాంతములు లేవు.

డిక్రీ హోల్డర్ విలువు	రూ. 10,00,000/-
అమీను గారి విలువ	రూ. 20,00,000/-
మార్కెట్ విలువ	రూ. 23,25,110/-

జడ్జిమెంటు డెటార్లు విలువ దాఖలు చేయలేదు. కోర్టు వారి ఉత్తర్వులును అనుసరించి.

పి.రాజేశ్వరరావు
డిక్రీ హోల్డర్ తరుపు న్యాయవాది
పార్వతీపురం
సెల్: 9440510328